






"శాంతా. పేపరు చూశావా?" అంటూ ఫోను ఎత్తుతూనే అంది లక్ష్మి. రాంగ్ నెంబరు వస్తుందేమోనన్న అనుమానంకూడా లేకుండా.

"ఎవరు- కావాలి?" అంది అవతలి గొంతు.

"సారీ. రాంగ్ నంబర్" అంటూ నాలిక్కొరుచుకుని ఫోను పెట్టేసింది లక్ష్మి.

శాంత ఎప్పుడూ అంటూనే వుంటుంది- "ఫోను చేసినప్పుడు— చేసినవారి పేరు చెప్పాలి. అంతకంటే ముందు నంబరు అడగాలి" అంటూ. కాని నిద్రలో కూడా తడుముకోకుండా రింగ్ చేయగల శాంత నంబర్ తప్పు తిప్పుతానా అన్న ధీమా లక్ష్మికి.

"పొద్దుటే రాహుకాలం కేసులా వుంది. కాసేపుపోయాక చేస్తాను." అని వంటింట్లోకి వెళ్ళి పనిలో తలదూర్చాలని చూసింది లక్ష్మి. కాని- ఏంచేయబోతున్నా పొద్దుటే న్యూసు పేపర్లో చదివిన వార్తే జ్ఞాపకానికి వస్తూంది. లక్ష్మికి. పెళ్ళాం తల బకెట్టులోపెట్టి పోలీసు స్టేషనుకివెళ్లాడట. ఎంతదారుణం!, అని నిట్టూరుస్తూంది. "ఎలా చెయ్యగలిగాడు అంతదారుణం?" అని తనని తానే పదేపదే ప్రశ్నించుకుంటూంది లక్ష్మి. కాని అసలేం బుర్ర పనిచెయ్యడం లేదు. అందుకే శాంతికి ఫోను చేసింది— అలజడి కాస్త పంచుకుందామన్నకోరికతో.

కాఫీ చేసుకుంది. కాని తాగ బుద్ధి కాదం కాలేదు. ఇంట్లో ఎవరూలేరు—కాస్త ఇటూ అటూ తర్కించాలన్నా....

వాళ్ళ ఫోను దగ్గిర కుర్చీలో వచ్చి కూర్చుంది లక్ష్మి. "ఇదేం పని? ఎంత పెళ్ళాం అంటే లోకువైనా యిలా మెడ తెగనరకడమేనా!" అనుకుంటూ ఫోను తిప్పింది. "అమ్మయ్య. శాంతా నేను యిందాకాచేస్తే రాంగ్ నంబర్ వచ్చింది!"

"కొంపతీసి నేనే అనుకుని వడవడ వాగేయలేదు కదా?" నవ్వుతూనే అడిగింది శాంత.

"లేదులే కాని. ఈ రోజు పేపరు చూశావా?" ఆత్రంగా అడిగింది లక్ష్మి.

"నువ్వు చూసేవి యింకా చూడలేదోయ్." నవ్వేసింది శాంత.

"అంటే! నీ ఉద్దేశ్యం?"

"అదే నువ్వు ముందు హెడ్డింగులు చదువుతావు. తరవాత చిన్న సైడు పిల్లర్సు చదువుతావు. తరవాతేగా పతాక శీర్షిక లన్నీ నీ కళ్ళ పడతాయి: చెప్పవే- ఈ రోజు ఏం దారుణం జరిగింది" అడిగింది.

"అబ్బ! ఎలా చదవకుండా వుంటావో కదా శాంతా. ఓ ప్రబుద్ధుడు పెళ్ళాం తల నరికి బకెట్టులో వడేసుకుని పోలీసుస్టేషనుకి వెళ్ళాట్ట" ఆగింది లక్ష్మి.

"నయమే కదా. పారిపోలేదని సంతోషించాలి మనం" తాపీగా అంది శాంత.

"అదే" అలా లైట్‌గా కొట్టి పారేస్తావేం? ఆమె శీలాన్ని శంకించాడట. దానికిదా శిక్ష. వదిలి పోకూడదూ-రాస్కెల్" కసిగా అంది లక్ష్మి.

"మనువని వుండేవాడులే. వాడిచ్చాడు. ఇప్పుడు వాడి కథ చెప్పనా నీకు"నవ్వింది.

"నువ్వెప్పుడూ యింతే— పెళ్ళాన్ని వదిలేయవచ్చు కదా యిలా దారుణంగా చంపే బదులు."

"అప్పుడు ఆమెని ఫలానావాడి పెళ్ళామని అంటారు కదా ? అతగాడి అహం దెబ్బ తింటుంది."

ఫోనులో క్రాస్ టాక్ వస్తూంది.

"తరవాత మాట్లాడుదాం. పెట్టెయ్యకూడదూ?" సూచించింది శాంత.

"నాన్సెన్స్. మళ్ళీ రాంగ్ నంబర్ రావచ్చు. మీ సైడు ఫోన్లు అఫైరించినట్టే వుంటాయి. చూడు శాంతా- ఆడదంటే ఎంత లోకువో- వీడు అడ్డమైన తిరుగుళ్ళు తిరగవచ్చు. అదేం శంకించవలసిన శీలం కాదు. కాని భార్యశీలం ఉట్టుట్టినే శంకించే హక్కు ఎవడిచ్చాడో వీడికి?" చాలా కోపంగా అంది.

"అంచేత ?"

"అంతే-పౌరుషంనిరూపించుకున్నాడు. ఒకే దెబ్బకి రెండు పిట్టల్ని కూల్చాడు. తనో హీరో అయ్యాడు. క్షణికోన్మాదనా వాదనకి - అవకాశం మిగుల్చుకున్నాడు."

"అంటే!" ఎక్కడో నూతిలోంచి వచ్చినట్టు వుంది లక్ష్మిమాట.

"అంతే. మగాడు పెళ్ళాన్ని వదిలేస్తే ఏమీ అనుకోరు. "మొగుడొదిలేసినది" అని ఆమెనే చిన్నబుచ్చి చూస్తారు. ఇక అదే పెళ్ళాం వదిలేస్తే పౌరుషంతో క్షణ క్షణం చస్తుంటాడు. అందుకే- అందుకే అనుమానం రాగానే నరికేశాడు. ఇక ఇద్దరికీ విశ్రాంతి" నిట్టూరుస్తూ అంది శాంత.

"అదేమిటి శాంతా ? ఇది ఆడదానికి అన్యాయం కాదా?"

"అన్యాయమే కాని ఒక విధంగా యిదే మెరుగేమో. పాపం ఆ స్త్రీకి. బ్రతికి నన్నాళ్ళు అనుమానంతో చంపుకుతినే కంటే-ఒక్క వేటుతో ఆమెని నరకం నుంచి విముక్తి చేశాడు మహానుభావుడు. లక్ష్మి- ఇంకా నువ్వు ఎప్పుడీ లోకాన్ని మామూలు కళ్ళతో చూస్తావు? పిచ్చిదానా! వాడు మూమెంటరీ ఇన్‌సేనిటీ ప్లే నెగ్గుకొస్తాడు. చూస్తూండు.... పేపర్లో కాస్త మంచి వార్త చదివినప్పుడు మళ్ళీ ఫోను చెయ్-పెట్టేస్తా." అంది శాంత.

"బాగా చెప్పారు!" అందో మగగొంతు క్రాస్ టాక్ శ్రద్ధగా విని.

లక్ష్మి షాకిచ్చినట్టు ఫోను పెట్టేసింది.




టుప్! టప్! టప్-

మంచంమీద పడుకుని ఆ రోజు పేపరు చదువుకుంటున్న రాజు వులిక్కిపడి లేచేడు. మళ్ళీ అదే చప్పుడు. కడుపులో బాధ అన్పించింది. తన కిటికీకి ఎదురు కిటికీలో రోజూ సరిగ్గా రాత్రి 9 గం- 10 గం. మధ్య తను ఆ యింట్లోకి వచ్చిన నెలరోజుల నుంచీ వింటున్నాడు. ఒకే ఇంట్లో అయితే ఏదోవిధంగా ఆ చప్పుడు తెలుసుకునేవాడు. రోజూ వినిపించే ఈ చప్పుడులో ఏదో విశేషం వుంది. తప్పకుండా తెలుసుకోవాలి. కానీ ఎలా?

మొదట్లో తన చిన్నప్పుడు తనూ తన ఫ్రెండ్స్ కలుసుకోవాలనుకున్నప్పుడు తను మూడు సార్లు చప్పట్లుకొడితే ఆ పక్క వీధిలోవున్న తన ఫ్రెండ్స్ మళ్ళీ మూడు సార్లు చప్పట్లు కొట్టి తనకి రిప్లై ఇచ్చేవారు. అట్లా ఏ లవర్స్ అయినా ఆ కోడ్ ఉపయోగించుకుంటున్నారేమో అనుకునేవాడు. కానీ ఒకే ఇంట్లోంచి వినపడుతోంది. అదీ కాక ఆ ఇంట్లో వున్నది భార్యా భర్తలే కనుకదానికి సంబంధించినది కాదు, అనిపించింది కానీ. ఏ రోజుకారోజు ఆ చప్పుడుకి కారణం తెలుసుకోవాలనే కుతూహలం పెరిగిపోతోంది.

రాజు ఆ ఇంట్లోకి క్రొత్తగా వచ్చేడు. రాజు వుండే ఆ గది, ఆ యింటి వాళ్ళు ఇంటి వెనగా వంటకోసం ప్రత్యేకంగా కట్టించుకున్న గదిని అద్దెకోసం ఇంకొంచెం మార్పులు చేసి రాజుకిచ్చేరు. అంచేత రాజు తన ఇంటి కిటికీలు తెరిస్తే ఆ పక్క వీధిలో వాళ్ళ ఇంటి కిటికీలు, వాళ్ళ గదీ అంతా కనిపిస్తుంది.

వాళ్ళకీ తనకీ ఆ కిటికీలు మినహా మరే మార్గమూ లేదు. పోనీ ఏ పిల్లలైనా వున్నారేమో వాళ్ళకి. ఆ చప్పుడు గురించి అడుగుదామని చాలాసార్లు చూసేడు. కానీ వాళ్ళకి సంవత్సరం లోపునే వున్న చంటి పిల్ల మాత్రమే వున్నట్లు కిటికీల ద్వారా గ్రహించేడు. నాకెందుకులే అని వూరుకుందామనుకున్నా ఈ రోజు ఉదయం చూసిన సంఘటనతో ఎందుకో మనసులో చాలా బాధగా వుండి ఏ పనీ చెయ్యబుద్ధి పుట్టడం లేదు.

రోజూలాగే వంట చేసుకుని, తిని, 10 గంటలకు ఆఫీసుకి తయారయి, కిటికీలు మూసేయడాన్కి కిటికీ దగ్గరకి